
సాక్షి
విజయనగరం

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ
'జగనన్నకు చెబుదాం'కు అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. - 8లో



నేటి నుంచి 65వ ఉరుసు మహోత్సవాలు - 8లో
ఖాదర్‌వలీ సూఫీ సుగంధ మహోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి.



ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ
ఏపీలోని వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఇళ్ల పండగకు తరలిరండి



డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలోని గుమడాం సమీపంలో నిర్మించిన 1056 టిడ్కో ఇళ్ల పంపిణీ పండగ మంగళవారం జరగనుందని, దీనికి పట్టణ ప్రజలందరూ హాజరుకావాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. పేదవాడి సొంతింటి కల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధ్యమైందన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయడం సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రతి లబ్ధిదారునిపై సుమారు రూ.7 లక్షలు భారం వేయాలని చూస్తే.. నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయికే లబ్ధిదారు పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇంటిని అప్పగిస్తోందన్నారు. ఈ బృహత్తర క్రతువులో అందరూ పాలుపంచుకోవాలని కోరారు.

పైడితల్లి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా

- ఈఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరావు



పైడితల్లి ఆలయ ఈఓగా బాధ్యతలు చేపడుతున్న డీవీవీ ప్రసాదరావు

విజయనగరం టౌన్: ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తుల సహకారంతో ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. ఈఓగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు చేయూతనందించాలని కోరారు. ఆలయ సూపర్‌వైజర్లు ఏడుకొండలు, రమేష్ పట్నాయక్, మణికంఠ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

24 నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

కొత్తవలస: కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 24 నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్టు శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ లిమిటెడ్ కర్మాగార ప్రతినిధి జి.శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో మండలం నుంచి ఒక్కజట్టు మాత్రమే పాల్గొనాలన్నారు. ఆసక్తిగల జట్లు ఈ నెల 20లోగా సెల్: 94935 49621, 94935 48330 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవాలని కోరారు. విజేతలుగా నిలిచిన మొదటి నాలుగు జట్లకు వరుసగా రూ.లక్షా25వేలు, రూ.60వేలు, రూ.30వేలు, రూ.25వేలు చొప్పున నగదు బహుతులు అందజేస్తామన్నారు.

25న ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

విజయనగరం టౌన్: శ్రీ జైన్ శ్వేతాంబర్ తేరా పంత్ మహిళా మండలి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న జైన్ భవన్‌లో మహిళలకు బ్రెస్ట్, సర్వికల్ కేన్సర్‌కి సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్‌లను ఉచితంగా నిర్వహిస్తామని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సురానా, వినితా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ టెస్ట్‌లను అంకాలజిస్టులు డాక్టర్ లీలా, డాక్టర్ ప్రియాంక నిర్వహిస్తారన్నారు. టెస్ట్‌లకు హాజరయ్యే మహిళలందరూ తమ ఆధార్‌కార్డులను తీసుకురావాలని కోరారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థల దరఖాస్తుకు గడువుపెంపు

పార్వతీపురం: జర్నలిస్టుల ఇళ్ల స్థలాలలకు ఫిబ్రవరి 26 వరకు దరఖాస్తు చేసుకునేందుకు మరోసారి ప్రభుత్వం గడువుపెంచిందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి ఆదేశాలు జారీచేశారన్నారు. వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోని అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐపీఆర్.ఏపీ.జీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

గిరిజన రైతుకు ధరల 'చింత'

కురుపాం: వ్యాపారుల సిండికేట్‌తో చింతపండుకు ధరలేక గిరిజన రైతులు దిగాలు పడుతున్నారు. గతేడాది కేజీ చింతపండు రూ.33 వరకు ధర పలికింది. ఈ ఏడాది రూ.23 నుంచి రూ.25కు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీసీసీ అధికారులు స్పందించి మద్దతు ధర కిలో రూ.36కు చింతపండు మొత్తం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

సంక్షేమ పాలనకు ఓటేయండి



రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

- రాజాం ఆర్టీసీ కాంప్లెక్ ప్రారంభంలో మంత్రి బొత్స సత్యనారాయణ

రాజాం: సంక్షేమ, అభివృద్ధి పాలనకు పట్టంకట్టాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు ఏ ప్రభుత్వ హయాంలో మేలు జరిగిందో బేరీజు వేసుకోవాలన్నారు. రాజాంలో రూ.1.80 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్ భవనాన్ని, రూ.1.60 కోట్లతో నిర్మించిన ఆదర్శనగర్, బుచ్చింపేట అర్బన్ హెల్త్ సెంటర్ భవనాలు, రూ.1.08 కోట్లతో నిర్మించిన కొత్త సబ్ ట్రెజరీ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. బస్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అర్హత ఉండి పథకం అందనివారెవరైనా ఉంటే లేచి ప్రశ్నించాలన్నారు. మేం అధికారంలోకి వచ్చామంటే శంకుస్థాపనలే కాకుండా అంతకుమించి ప్రారంభోత్సవాలు కూడా చేస్తున్నామన్నది ప్రజలు గుర్తించాలని తెలిపారు. రాజాంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే గతంలో ఎమ్మెల్యే కంబాల జోగులను గెలిపించినట్టే, వచ్చే ఎన్నికల్లో డాక్టర్ తలే రాజేష్‌ను గెలిపించాలన్నారు. మేం ఏమి చేశామో చెప్పగలిగే సత్తా మాకుందని, తామేమి చేశామో చెప్పకుండా... ఏదో ఒకటి నోటికి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న వ్యక్తులను ఆయా పార్టీలు ప్రోత్సహించడం చాలా తప్పుడు విధానమన్నారు.

- రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ రాజాం అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషిచేసిందన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలను ఆదుకుంటున్నారని, ఈ



రాజాం అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరులు



రాజాంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ప్రజలు, పార్టీ కార్యకర్తలు

ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు.

సక్రమంగా వినియోగించుకోవాలి

రాజాంలో నూతన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను తక్కువ సమయంలో చాలా చక్కగా నిర్మించినట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. అన్ని వసతులతో నిర్మించిన బస్ కాంప్లెక్స్‌ను ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కాంప్లెక్స్ మీదుగా ప్రతిరోజు 125 బస్సులు 450 ట్రిప్పులు తిరుగుతాయని, 2,500 మంది ప్రయాణికులకు సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, నియోజకవర్గ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణ, ఆర్టీసీ జోనల్ చైర్మన్ జి.బంగారమ్మ, మాజీ ఎమ్మెల్యేలు తలే భద్రయ్య, మీసాల నీలకంఠంనాయుడు, ఆర్టీసీ ఈఈ కె.వెంకటరాజు, డీఎం జె.శ్రీనివాసరావు, రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పొట్నూరు లక్ష్మణరావు, గెడ్డాపు

459 మంది గొర్రెల పెంపకందారులకు కిట్ల పంపిణీ

చీపురుపల్లి: చీపురుపల్లి నియోజకవర్గంలోని 459 మంది గొర్రెలు పెంపకందారులకు రూ.24లక్షల జెడ్పీ నిధులతో కొనుగోలుచేసిన నెట్లు, రెయిన్‌కోట్, టార్చ్‌లైట్ల కిట్లను 75 శాతం రాయితీపై మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ గ్రామాలకు వచ్చే టీడీపీ పగటివేషగాళ్ల మాటలు నమ్మొద్దన్నారు. ఎవరు మీకు మంచిచేస్తే వారి పక్షాన నిలబడాలని కోరారు. పైసా అవినీతి లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల ఖాతాలకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ఆర్థిక ప్రయోజనం జమచేస్తుంటే చంద్రబాబునాయుడు ఓర్వలేకపోతున్నారన్నారు. పేదలకు పింఛన్, చేయూత, ఆసరా, విద్యాదీవెన, అమ్మఒడి, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలుచేయడం తప్పా అని ప్రశ్నించారు. 14 సంవత్సరాల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబునాయుడు ఒక్కసంక్షేమ పథకాన్ని కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీల దందాపాలనను ప్రజలెవరూ మర్చిపోలేదన్నారు.

గొర్రెలు కాపరులకు అండగా వైఎస్సార్‌సీపీ

జిల్లాలో ఉన్న గొర్రెల పెంపకందారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. 75 శాతం రాయితీపై వివిధ పరికరాలతో పాటు జిల్లాలో గొర్రెలు పెంపకందారులకు రూ.20 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మన్నేల కృష్ణ, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, చీపురుపల్లి, గుర్ల జెడ్పీటీసీ సభ్యులు వలిరెడ్డి శిరీష, శీర అప్పలనాయుడు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, గరివిడి ఉపసర్పంచ్ బమ్మిడి కార్తీక్, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



గొర్రెల పెంపకందారులకు కిట్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరులు

అప్పలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 3 నుంచి పల్స్ పోలియో కార్యక్రమం

- కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం అర్బన్: వచ్చే నెల 3న నేషనల్ ఇమ్యూనైజేషన్ డే సందర్భంగా మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో షెడ్యూల్‌ను ప్రకటించారు. తొలుత మెగా వ్యాక్సినేషన్ డ్రైవ్‌గా 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. మిగిలిన వారికి 4, 5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలు, గిరిజన, మత్స్యకార ప్రాంతాల్లోని పిల్లలకు చుక్కలమందు అందేలా చూడాలన్నారు. అలాగే, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో పోలియో బూత్‌లను ఏర్పాటుచేయాలని సూచించారు. వచ్చేనెల 2వ తేదీన అన్ని గ్రామాల్లోనూ దండోరా వేయించాలన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా డ్వాక్రా సభ్యులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తల సహకారంతో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కరరావు, డీఐఓ డాక్టర అచ్చుతవల్లి, తదితరులు పాల్గొన్నారు.

• విజినిగిరిలో ఉపనయనాల సందడి




జామి మండలం విజినిగిరిలోని శ్రీ యోగచైతన్య ఆశ్రమంలో సోమవారం సామూహిక ఉపనయనాలు సందడిగా సాగాయి. యోగా గురువు టి.ఎల్.నరసింహులు శాస్త్రోక్తంగా ఉపనయనాలు చేశారు. 35 మంది బాలురు, 17 మంది బాలికలకు ఉపనయనాలు నిర్వహించారు. కార్యక్రమంలో యోగా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. – జామి

సీతారాముల కల్యాణం చూతము రారండి

- నేడు రామతీర్థంలో తిరుక్కల్యాణ మహోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన దేవస్థానం సిబ్బంది





రామతీర్థం దేవస్థానం, (ఇన్‌సెట్లో) సీతారాముల ఉత్సవ విగ్రహాలు

నెల్లిమర్ల రూరల్: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని రామతీర్థంలో సీతారామస్వామి తిరుక్కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి కనుల పండువగా జరగనుంది. దీనికి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 16న జరిగిన స్వామివారి పందిరిరాట మహోత్సవం నుంచే రామతీర్థానికి కల్యాణశోభ సంతరించుకుంది. నాలుగు రోజుల నుంచి రామక్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సీతారామచంద్ర ప్రభువులను, తూర్పు రాజగోపురం వద్ద వేసిన స్వామివారి పందిరరాటను దర్శించుకుంటున్నారు.

కనులారా తిలకిస్తే ఎంతటి భాగ్యమో....

వేకువజామునుంచే ఆలయంలో కల్యాణ మహోత్సవ పూజలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం యాగశాలలో విశేష హోమాలు జరిపించిన తరువాత స్వామివారి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణం, వేదపఠనం నిర్వహించనున్నారు. పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి చెందిన ఏకుల వంశీయులు ఎప్పటిలాగే సీతమ్మవారి తరఫున కల్యాణ వేడుకకు హాజరై స్వామివారికి పూజా ద్రవ్యాలను సమర్పించనున్నారు. పట్టు వస్త్రాలతో సీతారామస్వామివారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. నాదస్వర కచేరి నిర్వహించిన తరువాత స్వామివారి ఉత్సవ విగ్రహాలను రామతీర్థం పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఊరేగింపులోనే సీతారాముల ఎదురు సన్నాహక మహోత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం ఆ ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపంలోనికి తీసుకువచ్చి రాత్రి 9.30 గంటలకు అశేష భక్తజనం నడుమ స్వామివారి తిరుక్కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపిస్తారు. అనంతరం 10 గంటలకు ఆరగింపు, మంగళాశాసనం జరిపిస్తారు.



బోడికొండ వద్ద మృత్సంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా అంకురార్పణ

రామతీర్థంలో సీతారాముల వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకొని సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, దీక్షధారణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. బోడికొండ వద్దకు ఊరేగింపుగా వెళ్లి పుట్టమట్టిని సేకరించారు. అనంతరం స్వామి కల్యాణానికి అంకురారోపణ చేపట్టి మంగళాశాసనం నిర్వహించారు.

కల్యాణోత్సవంతో సకల శుభాలు



మానవుడికి సకల శుభాలను అందించగలిగే శక్తి సీతారాముల కల్యాణోత్సవానికి ఉంది. అందుకే, ఏ ఉత్సవాల్లో అయినా కల్యాణోత్సవం ప్రధానమైన ఘట్టం. రామతీర్థంలో రామస్వామి వారి దేవాలయం ప్రతిష్టాపన చేసిన రోజున ఏటా తిరుక్కల్యాణ మహోత్సవాన్ని జరపడం ఆనవాయితీగా వస్తోంది. భారతీయ సంస్కృతికి మూలాధారాలు దేవాలయాలు. దేవాలయంలో జరిగే ఉత్సవ, ఆరాధనలు, కల్యాణోత్సవాలు లోక కల్యాణం కోసమే నిర్వర్తిస్తున్నారు. సామాన్యుడు సైతం నిర్వహించుకోగలిగిన మహాయజ్ఞం స్వామివారి కల్యాణోత్సవమే.

– సాయిరామాచార్యులు, అర్చకులు, రామతీర్థం దేవస్థానం

తోటపల్లిలో కల్యాణ శోభ

- వేంకటేశ్వరుని కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరగనున్న వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణంలో తాటి కమ్మలతో పందిరి వేశారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి సూర్యనారాయణ సమక్షంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వీరఘట్టానికి చెందిన యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్. శర్మయాజీ పర్యవేక్షణలో అర్చకులు నరశింహాచార్యులు, అప్పలాచార్యులు స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించనున్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తుల కోసం ప్రత్యేకంగా లడ్డూ ప్రసాదాన్ని తయారుచేస్తున్నారు. ఫిబ్రవరి 24న ఉదయం 8 గంటలకు పవిత్ర నాగావళినదిలో స్వామివారికి శ్రీచూర్ణోత్సవం, శ్రీచక్రతీర్థ స్నానం నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యంలో పాల్గొని తరించాలని ఈఓ కోరారు.



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ సత్యనారాయణ, అధికారులు



ఆలయ ముఖద్వారం

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పణ

కల్యాణోత్సవంలో భాగంగా స్వామివారికి, పద్మావతి అమ్మవార్లకు ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ మంగళవాయిద్యాలతో సోమవారం పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శంబరకు మార్గం సుగమం

- పోలమాంబ భక్తుల్లో ఆనందం
- డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవతో రోడ్డు కష్టాలు దూరం

సాలూరు రూరల్: గతంలో పోలమాంబ దర్శనానికి శంబర చేరుకోవాలంటే నరకయాతన. మక్కువ నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని రోడ్డు గోతులతో దర్శనమిచ్చేది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డుపై ప్రయాణించాల్సిన దుస్థితి. శంబర, సీబిల్లి పెద్దవలస, చీపురువలస, అన్నంరాజువలస, పందిరి మామిడి వలస, ముచ్చర్లవలస, లక్ష్మీపుర తదితర గ్రామాల ప్రజలు సాలూరు వచ్చి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఏటా ఎంతో వైభవంగా నిర్వహించే పోలమాంబ జాతరకు వేల సంఖ్యలో విచ్చేసే భక్తులు రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ఎన్నో అవస్థలు పడేవారు. అయితే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏటా లక్షలాది రూపాయలను వెచ్చిస్తూ, అప్పటికప్పుడు గోతులను కప్పుతూ తాత్కాలిక మరమ్మతులు చేసేవారు. రోడ్డు నిర్మాణ విషయాన్ని టీడీపీ నాయకులు భంజ్‌దేవ్, సంధ్యారాణి పట్టించుకోలేదు. శంబరకు సమీపంలోనే సంధ్యారాణి స్వగ్రామం కవిరిపల్లి. ఎమ్మెల్సీగా పలుమార్లు స్వగ్రామానికి వచ్చినా శంబర రోడ్డు ఊసెత్తలేదు.



కొత్తగా నిర్మించిన మామిడిపల్లి నుంచి శంబర వెళ్లే రహదారి

ప్రయాణికుల కష్టాలు పట్టించుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక.. డిప్యూటీసీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మామిడిపల్లి నుంచి శంబర మీదుగా మక్కువ గ్రామానికి 14.8 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ.8కోట్లు మంజూరు చేయించారు. అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశారు. దీంతో పోలమాంబ దర్శనానికి వెళ్లే భక్తులు ప్రశాంతంగా ప్రయాణం సాగిస్తున్నారు. రోడ్డు సదుపాయం అక్కరకు రావడంతో ప్రతివారం అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతోంది. గత ఎనిమిదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం రోడ్డు బాగుందంటూ సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

క్లుప్తంగా

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య


తాడేలు ఏకాశి (ఫైల్)

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన యవకుడు తాడేలు ఏకాశి(20) ఇంటిలో ఉరివేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాలప్డాడు. ఈ సంఘటనపై బత్తి ఏఎస్సై కె.కాంతారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమ ఏకైక కుమారుడు ఏకాశి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తాము ఇంటిలో లేని సమయంలో ఉరివేసుకున్నాడని మృతుని తల్లిదండ్రులు తాడేలు అప్పన్న, అనసూయలు విలపిస్తున్నారు. ఏకాశి పదవ తరగతి ఫెయిలాయ్యక కొత్తూరులో బట్టల షాపులో పనిచేస్తున్నాడు, తల్లిదండ్రులు కాంక్రీట్ మిక్సర్‌తో రాజువారీ కూలి పనికి వెళ్లి వచ్చిన తరువాత ఇంట్లో కుమారుడు ఉరివేసుకుని ఉండడాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.

రెండు అనుమానాస్పద మృతి కేసుల నమోదు


సోములమ్మ మృతదేహం

శృంగవరపుకోట: మండలంలో రెండు వేర్వేరు అనుమానాస్పద మృతి కేసులను ఎస్.కోట పోలీసులు సోమవారం నమోదు చేశారు. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట మండలంలోని మూల బొడ్డవర పంచాయతీకి చెందిన కందుల సోములమ్మ (60) మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రించిన ఆమె సోమవారం ఉదయం ఎప్పటికీ లేవకపోవడంతో స్థానికులు అరిచినా పలకలేదు. దీంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి మృతిచెందిఉందని, వంటిపై గాయాలున్నాయని స్థానికులు చెప్పారు. అలాగే ఇంట్లో ధాన్యం, బట్టలు ధ్వంసం చేసి ఉన్నాయన్నారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ షణ్ముఖరావు, ఎస్సై, సిబ్బంది సంఘటానా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. అలాగే మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన రవితేజ(24) గ్రామ సమీపంలో శ్మశాన వాటికలో చెట్టుకు ఉరివేసుకుని ఉన్నాడు. రవితేజ డిగ్రీ చదువుకున్నప్పటికి గోస్తనీ నది నుంచి ఎడ్లబండిపై ఇసుక గ్రామాల్లోకి తోలుతూ జీవనం సాగిస్తుంటాడు. ఏకారణంతో చనిపోయాడో తెలియదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అనుమానస్పదమృతిగాకేసు నమోదు చేశారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు


ప్రదర్శనలను తిలకిస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, తదితరులు

విజయనగరం అర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గురజాడ పాఠశాలలో విద్యార్థులు సోమవారం ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి తొలి ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ స్వరూప, ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా వారోత్సవాలు విజయవంతం

విజయనగరం గంటస్తంభం: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు విజయవంతమయ్యాయని జిల్లా ప్రాంతీయ రవాణా శాఖ ఉప కమిషనర్ జీఆర్ రవీంద్రనాథ్ అన్నారు. జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు నిర్వహించిన మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం సోమవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు లేని దేశాన్ని రూపొందించవడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ముఖ్యంగా కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో యువతకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 50 శాతం కంటే ఎక్కువ యువకులే మృతి చెందుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని యువత గమనించి నిబంధనల మేరకు డ్రైవింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. రమేష్, ఎ.వెంకటరమణ, యు. దుర్గాప్రసాద్, రవి శంకర్ ప్రసాద్, వి. ఐశ్వర్యలక్ష్మి, కార్యాలయ ఏఓ ఎం.లత, తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹138	₹246	₹ 256

వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

● కలెక్టర్ నాగలక్ష్మి


అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి స్పందించాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సమబాల, మురళీకృష్ణ, సీపీఓ బాలాజీ, మెప్మా పీడీ సుధాకర రావుతో కలసి కలెక్టర్ 182 వినతులు స్వీకరించారు. వినతుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖ సమస్యలపై 129, డీఆర్‌డీఏకు 11, గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు 12, జిల్లా పంచాయతీ విభాగానికి 7, గృహనిర్మాణ శాఖకు 7, జిల్లా ఆస్పత్రులకు సంబంధించి 3, ఏపీవిద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించి 3 వినతులు, మున్సిపల్ శాఖకు 10 వినతులు అందాయి.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయనతో పాటు ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవ నాయుడు, ఆర్‌డీఓ కె.హేమలతలు ప్రజలనుంచి 167 వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ పగడాలమ్మ, జిల్లా ప్రజా రవాణా అధికారి టి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఏపీవో రోసిరెడ్డి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం టౌన్: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు తక్షణ న్యాయం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి 33 ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఎస్సై ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 18 వినతులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 19 వినతులు వచ్చాయి. ఏపీవో రోసిరెడ్డి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఈఈ సింహాచలం, డిప్యూటీఈవో లిల్లీరాణి, పీఏవో హరికృష్ణ, పీహెచ్‌వో గణేష్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నియోజకవర్గం పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం అందజేశారు. ఈ మేరకు కోలగట్ల స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 28లక్షల 64వేల చెక్కులను లబ్ధిదారులకు అందుకున్నారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొనే వారు, మృత్యువాత పడిన నిరుపేద కుటుంబాలకు అనేక రూపాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నిధులను మంజూరు చేస్తున్నారని తెలిపారు.

డ్రాగా ముగిసిన రంజీ మ్యాచ్


72 పరుగులు చేసిన అశ్విన్ హెబ్బర్

విజయనగరం: రెండవ ఇన్నింగ్స్‌లో ఆంధ్ర బ్యాట్స్‌మన్ అశ్విన్ హెబ్బర్ 72 పరుగుల (165 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్)లో అద్భుత ఇన్నింగ్స్‌తో ఆతిథ్య ఆంధ్ర జట్టు ఓటమి నుంచి బయటపడి కేరళతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. టెస్ట్ మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు సాగిన మ్యాచ్‌లో చివరి రోజు సోమవారం 7 ఓవర్లలో వికెట్ నష్టానికి 19 పరుగుల ఓవర్ నైట్ స్కోరు వద్ద రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మ్యాచ్ ముగిసే సమయానికి మొత్తం 97 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 189 పరుగులు జోడించింది. జట్టు బ్యాటింగ్‌లో కరన్ షిండే 26 పరుగులు, ఎస్‌కె రషీద్ 36 పరుగులు, అశ్విన్ హెబ్బర్ 72 పరుగులు, షోయబ్ మహమ్మద్‌ఖాన్ 11 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. బౌలింగ్‌లో కేరళ క్రీడాకారులు బిశాల్ 3 వికెట్లు, తంపీ 3 వికెట్లు, చంద్రన్ 2 వికెట్లు ఆక్కించుకున్నారు. అంతకు ముందు ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 96.4 ఓవర్లలో 272 పరుగులు చేయగా.. కేరళ జట్టు 7 వికెట్ల నష్టానికి 514 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది.

సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

● 21 నుంచి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో పోటీలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సిటీ క్లబ్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 170 మంది క్రీడాకారులు హాజరుకాగా జిల్లా జట్టులో స్థానం సాధించేందుకు తీవ్ర స్థాయిలో పోటీపడ్డారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులను బాలుర జట్టులోకి , 12 మంది బాలికల జట్టులోకి ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23వ తేదీ గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరగనున్న అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావుదొర, కార్యదర్శి కేవీ ప్రభావతిలు తెలిపారు. ఎంపిక పోటీలను జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, నడిపేన సూర్యనారాయణ, మీసాల శ్రీనివాస రావు, మజ్జి తిరుపతిరావు, సారిపల్లి గౌరీశంకర రావు, మజ్జి తిరుపతిరావు, బంటుపల్లి శివ, భాను తదితరులు పర్యవేక్షించారు.

మద్యం సీసాలు స్వాధీనం


గజపతినగరం: మద్యం సీసాలను సీజ్ చేసి విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సై మహేష్

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురంలో అనధికారంగా మద్యం సీసాలు విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎ.సన్యాసి నాయుడు సోమవారం తెలిపారు. అనధికార బెల్టు షాపులో విక్రయానికి ఉంచిన 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడిలో ఎస్సైతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


మధుపాడలో..

గజపతినగరం: మండలంలోని మదుపాడగ్రామానికి చెందిన ఎ.రాముపై మద్యం అక్రమ రవాణా కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 33 మద్యం సీసాలను గజపతినగరం నుంచి తరలిస్తుండగా రామును అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి 65వ ఉరుసు మహోత్సవాలు

● బాబామెట్టలో మూడురోజుల పాటు వేడుక
● రాష్ట్ర, రాష్ట్రేతరప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తులు
● ప్రతి ఒక్కరూ హజరత్ ఖాదర్ బాబాను దర్శించాలి: ఖలీల్‌బాబు


ఉరుసు ఉత్సవాల వివరాలను వెల్లడిస్తున్న ఖలీల్‌బాబు


ఖాదర్‌వలీబాబా దివ్య క్షేత్రం

విజయనగరం టౌన్: విజయనగరం ఆధ్యాత్మిక చక్రవర్తి, హజరత్ సయ్యద్ షహీన్‌షా బాబా ఖాదర్ వలీ 65వ మహాసూఫీ సుగంధ మహోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నట్లు ఖాదర్ బాబా దర్గా షరీఫ్ ముతవల్లి (ధర్మకర్త) డాక్టర్ ఎం.డి.ఖలీలులాల షరీఫ్ షా తాజ్ ఖాదరి (ఖలీల్ బాబు) పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఉరుసు ఉత్సవాల వివరాలను వెల్లడించారు. విజయనగరం లోని ఆబాద్‌వీధిలో 1900వ సంవత్సరంలో జన్మించిన సూఫీ మహనీయుడు ఖాదర్‌బాబా తన 14 ఏళ్ల ప్రాయంలో హజరత్ బాబా తాజుద్దీన్ (నాగ్‌పూర్) వారి నుంచి అనుగ్రహం పొంది, వారి ఆజ్ఞానుసారం విజయనగరం బాబామెట్ట వేంచేశారన్నారు. నాటి నుంచి కఠోర తపస్సు ఒనర్చి, ప్రజలను అనుగ్రహించారని చెప్పారు. 1961లో తనువు చాలించి, సమాధి పొందారని, ఆ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని బాబావారికి ఏటా గంధ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటలకు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుసు మహోత్సవం ప్రారంభమవుతుందని చెప్పారు.


హజరత్ ఖాదర్‌వలీబాబా

అనంతరం జెండా మహోత్సవం, చాదర్ సమర్పణ ఉంటుందన్నారు. రెండోరోజు బుధవారం ఉదయం ఖురాన్ పఠనంతో పాటూ నషాన్, చాదర్, సందర్ షరీఫ్‌లతో ఫకీర్ మేళా ఖవాలీలతో దర్బార్ షరీఫ్ నుంచి ఖాదర్ బాబా వారి భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. మూడోరోజు గురువారం ఖురాన్ పఠనం, చాదర్ సమర్పణ, దస్తార్ బందీ, భక్తులకు తబురుక్ ప్రసాదాల పంపిణీ, సలామ్ ఖుల్ షరీఫ్‌తో ఉరుసు సమాప్తమవుతుందన్నారు. మూడురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు సూఫీ పీఠాధిపతి హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా ఆధ్యాత్మిక వారసుడు, సజ్జాద నషీన్ మహమ్మద్ ఖాజా మోహియుద్దీన్ షా ఖాదరి అనుదిన దివ్య సందేశం ఉంటుందన్నారు. భక్తులందరూ ఉత్సవాలకు హాజరై సహాయ, సహకారాలందించాలని కోరారు.

రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు

ఉరుసు మహోత్సవాలకు ఆంధ్రప్రదేశ్‌లోని నలుమూలలతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి ఖాదర్ బాబావారి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నట్లు ఖలీల్‌బాబు పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన అన్ని రకాల వసతి సౌకర్యాలు ఏర్పాటుచేశామన్నారు. మూడురోజుల పాటూ మహా దివ్య అన్నసమారాధన ఘనంగా, నిర్విరామంగా కొనసాగిస్తామన్నారు.

ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ


సేవావజ్ర, సేవారత్న అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు

● అవినీతి లేకుండా పనిచేస్తున్న సేవకులు
● లబ్ధిదారులకు రూ.వేలాది కోట్ల సంక్షేమ పథకాల అందజేత
● మళ్లీ జగన్‌ను సీఎం చేసేందుకు మరింత కృషి చేయాలి
● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశంలో ఆదర్శంగానే కాకుండా ఎంతో గర్వకారణంగా నిలిచిందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశంసించారు. ఈ మేరకు చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించి సేవావజ్ర అవార్డు దక్కించుకున్న ఇజ్జరోతు పావనికి రూ.45 వేలు నగదు, సేవారత్న అవార్డులకు ఎంపికైన పిల్ల భవాని, కొడమంచిలి సత్యనారాయణ, బైరెడ్డి వసంతి, గడే భవాని, తెలుగు రమణలకు రూ.30 వేలు నగదు బహుమతితో పాటు ధ్రువీకరణ పత్రం, మెడల్ అందించి సత్కరించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల ప్రభుత్వ పరిపాలనలో ఒక్క చీపురుపల్లి మండలంలోనే అర్హులైన లబ్ధిదారులకు రూ.300 కోట్ల వరకు సంక్షేమ పథకాల రూపంలో పేదలకు వలంటీర్ల ద్వారా ప్రభుత్వం అందజేసినట్లు చెప్పారు. అందులో ఒక్క రూపాయి అవినీతి జరిగిందా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో గొప్ప మనసుతో ఆలోచన చేసి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి గొప్ప పేరు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు.

లబ్ధిదారుల కళ్లలో ఆనందం వలంటీర్‌కే సొంతం

గ్రామాల్లో ఎంతో మంది యువత ఉన్నప్పటికీ వలంటీర్‌గా సేవలు అందించి ప్రభుత్వంలో భాగస్వామ్యులయ్యేందుకు కొంతమందికి మాత్రమే అవకాశం లభించిందన్నారు. ప్రతి నెలా ఒక్కో వలంటీర్ పరిధిలో ఉన్న 50 కుటుంబాలు మాదిరిగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది కుటుంబాలు ముఖాల్లో ఆనందం చూడడం వలంటీర్లకు మాత్రమే సొంతమన్నారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటేనే ఇంతటి సుపరిపాలన మళ్లీ ప్రజలకు అందుతుందని చెప్పారు. అప్పుడు మాత్రమే వలంటీర్ల నిస్వార్థ సేవలు కొనసాగుతాయన్నారు. కానీ ఎన్నికలు వచ్చేసరికి బయటకొస్తున్న టీడీపీ నేతల ప్రభుత్వం వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు పేరుతో రాబందుల్లా ప్రజలపై పడిపోతారన్నారు. అందరూ అప్రమత్తంగా ఉంటూ లంచాలు, అవినీతి, దళారీ వ్యవస్థ లేని సంక్షేమ పరిపాలనను మరోసారి తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సారథ్యంలో జిల్లా, నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ.సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, జిల్లా పరిషత్ సీఈఓ కె.రాజ్‌కుమార్, ఎంపీడీఓ డి.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలమాంబ ఐదవ జాతర


పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఐదవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు అవసరమైన లడ్డు, పులిహోర ప్రసాదాలను తయారు చేయించారు. జాతరకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ జి.బాలకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

మార్చి 3న పల్స్‌పోలియో

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: మార్చి 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు సోమవారం పల్స్‌పోలియో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఎంఓ డాక్టర్ జాన్ జూట్ జోషువ పవర్‌ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ మార్చి 3న జరగబోయే పల్స్‌పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలను వారి పరిధిలోనే వైద్యసిబ్బంది వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 98వేల 991 మంది ఐదేళ్లలోపు పిల్లలకు 905 పోలియో బూత్‌లు కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నామని, 41 మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేసి బయట ఉన్న పిల్లలకు వేస్తారని, బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో కలుపుకుని 17ట్రాన్సిట్ కేంద్రాల్లో ప్రయాణాల్లో ఉండే పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి కార్యచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించి కార్యక్రమం విజయవంతమయ్యేందుకు అవసరమైన కార్యాచరణ చేయాలన్నారు. కరపత్రాలు, పోస్టర్లు, టామ్‌టామ్, మీడియా ద్వారా పల్స్‌పోలియో గురించి ప్రజలకు చేరువయ్యేలా దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ నారాయణరావు, జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివకుమార్, ఎఫ్‌డీపీ అధికారి డాక్టర్ వినోద్, ఎస్‌ఓ శంకర్, డెమోలు యోగేశ్వరరెడ్డి, సన్యాసిరావు, సూపర్‌వైజర్ జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.